క్లుప్తంగా

మైరావణ నాటకానికి బహుమతి

జడ్చర్ల టౌన్: మిర్యాలగూడ సంస్కృత కళాకేంద్రం పరిధిలో గురువారం నిర్వహించిన జాతీయస్థాయి పద్యనాటక పోటీల్లో జడ్చర్ల నవజ్యోతి కళానిలయం బృందం సత్తాచాటింది. వారు ప్రదర్శించిన మైరావణ పద్యనాటకానికి తృతయబహుమతి లభించింది. నందిని అవార్డు పేరిట కళాకేంద్రం అందజేసిన అవార్డుల్లో ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్టుగా సంపంగి కృష్ణ, ఉత్తమ ప్రతినాయకుడిగా రఘురామశర్మ, ఉత్తమ సహాయనటిగా సురభీ వెంగమాంబకు బహుమతులు అందినట్లు కళానిలయం నిర్వాహకులు బాద్మి శివకుమార్ తెలియజేశారు.

హనుమాన్‌చాలీసా పారాయణం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని గురురాఘవేంద్ర స్వామి మఠంలో గురువారం రాత్రి లోకకల్యాణార్థం భక్తబృందం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. రాఘవేంద్ర మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో పారాయణం చేశారు. మహామంగళహారతి నివేదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

యువతి అదృశ్యం

రాజాపూర్: మండల పరిధిలోని దోండ్లపల్లికి చెందిన అనూష కనిపించకుండా పోయింది. దీంతో ఆమె తండ్రి మల్లేష్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు మిస్సింగ్ కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. కాగా బుధవారం తన సొంతపనిపై మల్లేష్ నాగర్‌కర్నూల్ వెళ్లిన సమయంలో.. అనూష కనిపించకుండా పోయింది. దీంతో మల్లేష్‌కు ఆయన కుమారులు సమాచారం ఇచ్చారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు.

చలివేంద్రం ఏర్పాటు

నవాబుపేట: మండల కేంద్రంలో డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. గురువారం పోలీస్‌స్టేషన్ సమీపంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం ద్వారా ప్రజలకు నీరు అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, మల్లేష్ యాదవ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

గండేడ్/మహమ్మదాబాద్: మండల పరిధిలోని జక్లపల్లి గ్రామంలో యువజనసంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని గ్రామస్తులు అన్నారు. యువజన సంఘాలు మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ముదిరాజ్ యువజన సంఘం సభ్యులు తిరుపతయ్య, నర్సింహులు, రవి, శ్రీను, కృష్ణ, మోహన్ పాల్గొన్నారు.

ఈద్గాను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక న్యూగంజ్ (వానగట్టు) సమీపంలోని ఈద్గా వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని ఈద్గా కమిటీ సభ్యులు గురువారం మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డిని కలిసి విన్నవించారు. అనంతరం అక్కడికి ఆయన వెళ్లి పరిశీలించారు. చేపట్టాల్సిన పనులపై అధికారులతో కలిసి చర్చించారు. అనంతరం తెలంగాణచౌరస్తాలోని బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద విద్యుద్దీకరణ పనులను పరిశీలించారు. జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ ఈడీ పాండు, మున్సిపల్ డిప్యూటీ ఈఈ బెంజిమన్, ఏఈ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక న్యూగంజ్ (వానగట్టు) సమీపంలోని ఈద్గా వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తామని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం అక్కడి స్థలాన్ని పరిశీలించారు. వైస్‌చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, ఈద్గా కమిటీ చైర్మన్ తకీ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు న్యూటౌన్‌లో షిర్డీసాయి భజన మండలి ఆధ్వర్యంలో చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు.

చర్యలు తీసుకోవాలి

భూత్పూర్: మండలంలోని రావులపల్లి శివారులోని పట్టాపొలంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు గురువారం తహసీల్దార్ రాజుకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ సొంత ఇల్లు నిర్మాణం చేయుటకు వాగులు, కాల్వల్లోను, అనుమతులు ఉన్న రీచ్‌ల్లో మాత్రమే ఇసుక తరలించేందుకు ఆదేశాలు జారీ చేయగా రావులపల్లి, అన్నాసాగర్‌కు చెందిన ట్రాక్టర్ యజమానులు అనుమతులు లేకుండా తమ పట్టాపొలాల్లో ఇసుక తరలిస్తున్నారని పేర్కొన్నారు.

మెరుగైన విద్య అందించాలి



స్టేషన్‌మహబూబ్‌నగర్: పాఠశాలలు విద్య ప్రమాణాలు పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారి భవిష్యత్‌కు పునాదులు వేయాలని మహబూబ్‌నగర్ పుర చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మర్లులో స్కాలర్స్ నూతన పాఠశాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్ తరగతి గదిలో రూపుదిద్దుకుంటుందని, అందుకు ఉపాధ్యాయులు తగిన సహకారం అందించాలని తెలిపారు. వైస్ చైర్మన్ షబ్బీర్, కౌన్సిలర్లు యాదగిరి, ఉమర్, పాఠశాల యాజమాన్యం రవి, రామాంజనేయులు, మాధవరెడ్డి, పి.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

‘తడి’ లేదు.. ‘పొడి’ లేదు



మహమ్మదాబాద్‌లో నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్డు

- సేంద్రియ ఎరువుల తయారీ ఉత్తిమాటే..
- నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు
- చెత్తంతా డంపింగ్‌యార్డుల్లోనే..
- రూ.లక్షలు వృథా



రెడ్డిపల్లిలో పరిస్థితి ఇలా..



కుప్పలుగా ఒకే దగ్గర పోసిన చెత్త

గండేడ్: గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ముప్పు వాటిల్ల కూడదన్న ఉద్దేశ్యంతో గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీని ద్వారా తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి సేంద్రియ ఎరువులు తయారీ చేయడంతో పాటు మిగతా వ్యర్థాలను డంపింగ్ యార్డులో పోయాలి. ఇందుకు గానూ రూ. లక్షలు వెచ్చించారు. కానీ గ్రామపంచాయతీల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణలోపం కారణంగా ఇది ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. దీంతో లక్ష్యం నీరుగారుతున్నది. ఉమ్మడి గండేడ్ మండలంలోని మహమ్మదాబాద్, గండేడ్ మండలాల్లో 49 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 49 సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద ఒక్కోదాని నిర్మాణానికి రూ. 2.5 లక్షలు వెచ్చించారు. కాగా ప్రస్తుతం ఆయా గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. గండేడ్, మహమ్మదాబాద్ మండలాల్లో అక్కడక్కడా మినహా మిగతా చాలా చోట్ల వాడుకలో లేవు. రెడ్డిపల్లి, మహమ్మదాబాద్, చిన్నవార్వాల్, వెంకట్‌రెడ్డిపల్లి, పగిడ్యాల్, జానంపల్లి, ధర్మాపూర్, వెంకట్‌రెడ్డిపల్లి తదితర గ్రామాల్లో వినియోగంలో లేకుండా పోయాయి. ప్రారంభంలో వీటిపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు ప్రత్యేకదృష్టి సారించినా.. అయిదారు నెలలుగా ఎవరూ వాటి గురించే మాట్లాడడం లేదని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. సాధారణంగా గ్రామాల్లో సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా గుర్తించి వేరు చేయాలి. తడి చెత్తను కేటాయించిన అరల్లో వేసి వానపాములు వదలాలి. దీంతో కొన్ని రోజుల్లో మంచి సేంద్రియ ఎరువుగా తయారు అవుతుంది. దీనిని కిలో రూ. 10 నుంచి రూ. 15 వరకు అమ్మాలి. వచ్చిన డబ్బును జీపీ ఖాతాలో జమచేసి గ్రామాభివృద్ధికి కేటాయించాలి. అదేవిధంగా పొడి చెత్తను సైతం అమ్మి ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. కానీ ఉమ్మడి మండలంలో కనీసం పదిచోట్ల కూడా అమలు కావడం లేదు. వీటి తయారీ జరగడం లేదంటే పరిస్థితి ఏలా ఉందో ఇట్టే తెలుస్తుంది. సేకరించిన చెత్తను మొత్తం డంపింగ్‌యార్డులోనే వేస్తున్నారు. సెగ్రిగేషన్ షెడ్లు గ్రామాలకు దూరంగా ఉండడం, ఆయా చోట్ల తగినంత సిబ్బంది లేకపోవడం, అధికారులు పర్యవేక్షణ కొరవడడం వంటి అనేక కారణాలు లక్ష్యానికి అవరోధంగా మారుతున్నాయి. అధికారులు స్పందించి షెడ్లను సరిగా వినియోగించాలని పలువురు కోరుతున్నారు.

అందుబాటులోకి తీసువస్తాం

సెగ్రిగేషన్ షెడ్లను అందుబాటులోకి తీసుకు వచ్చే ప్రయత్నం చేస్తాం. ఇప్పటికే కొన్నిచోట్ల సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. వాటిని అవసరమైన వారికి విక్రయిస్తున్నారు. మరికొన్ని చోట్ల నర్సరీల్లో మొక్కలకు వినియోగించారు. షెడ్లను వాడకంలోకి తీసుకు రావాలని ఇటీవల అందరు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాం. గ్రామాల్లో సేకరించిన చెత్తను వేరుచేసి.. మిగతా వ్యర్థాలను డంపింగ్ యార్డుల్లో వేయాలి. అలా చేయకపోతే చర్యలు తప్పవు.

– కే. దేవన్న, ఎంపీడీఓ, ఉమ్మడి గండేడ్ మండలం

వెలుగొమ్ములలో అధికారుల పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

మిడ్జిల్: వెలుగొమ్ములలో నీటి గోస కథనం సాక్షి దిన పత్రికలో ఇటీవల ప్రచురించడంతో మండల అధికారుల బృందం గత వారం రోజుల నుంచి గ్రామంలో పర్యటిస్తోంది. గురువారం సైతం ఇంటింటికి తిరిగిన అధికారులు ఆయాచోట్లు నీటి సమస్యలను కొంతమేర పరిష్కరించారు. బుధవారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి నీటి సమస్య త్వరగా పరిష్కరించాలని సూచించడంతో.. గురువారం వివరాలు సేకరించి కలెక్టర్‌కు నివేదికలు సమర్పించారు. డీఈ రవిచందర్, తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ అనురాధ, ఏఈ లావణ్య, కార్యదర్శి రాజశ్రీ తదితరులు ఉన్నారు.

బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

చిన్నచింతకుంట: లాల్‌కోట చౌరస్తాలో బస్సుషెల్టర్ ఏర్పాటు చేయాలని టీఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. యాదగిరి డిమాండ్ చేశారు. గురువారం టీఎఫ్‌టీయూ, టీపీవీ సంఘాల ఆధ్వర్యంలో లాల్‌కోట, బండ్రపల్లి గ్రామాల ప్రజలతో కలిసి లాల్‌కోట చౌరస్తాలో కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైచూర్, హైదరాబాద్ హైవేపై లాల్‌కోట చౌరస్తాలో బస్సుషెల్టర్ లేక చిన్నచింతకుంట, మరికల్ మండలాలకు చెందిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వేసవి కాలంలో నీడలేక హోటళ్లు, చెట్ల నీడలను ఆశ్రయిస్తున్నారన్నారు. అంతేకాకుండా రైల్వేస్టేషన్‌కూడా ఏర్పాటు చేయాలని అన్నారు.

నాటుసారా సీజ్

మహబూబ్‌నగర్ క్రైం: ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై నాటుసారా తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు చేసిన తనిఖీల్లో పట్టుబడ్డాడు. ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి కథనం ప్రకారం..గురువారం తెల్లవారుజామున హన్వాడ మండల పరిధిలోని వెంకటమ్మ కుంట ఒతండా దగ్గర రూట్‌వాచ్ నిర్వహిస్తున్న క్రమంలో అదే తండాకు చెందిన విస్లావత్ రఘు ద్విచక్ర వాహనంపై నాటుసారా తరలిస్తుండగా పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. నాటుసారా, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు. అదేవిధంగా హన్వాడ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు వివరించారు.

ఇసుక ట్రాక్టర్..

రాజాపూర్: మల్లేపల్లి శివారులో గల దుందుభీ వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం తెల్లవారుజామున పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన ఆవ సాయిలుతో పాటు ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. హెడ్ కానిస్టేబుల్ ఆనంద్ ఫిర్యాదు పేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి వివరించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

హెచ్చరికలు బేఖాతరు

భూత్పూర్: మండలంలోని మద్దిగట్ల, పాతమొల్గర శివారు గ్రామాలకు చెందిన పొలంలో ఓ రియాల్టర్ 300 ఎకరాల్లో వెంచర్ చేసేందుకు రోడ్ల నిర్మాణం చేపడుతున్నాడు. గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ప్లాట్లు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో తహసీల్దార్ రాజుతో పాటు మద్దిగట్ల, పాతమొల్గరకు చెందిన గ్రామ కార్యదర్శులు, స్థానిక పోలీసులతో కలిసి పర్యవేక్షించారు. ప్రభుత్వం నుంచి అనుమతి లేదని క్రయ, విక్రయాలు చేయరాదని హెచ్చరికల బోర్డులు వెంచర్ వద్ద ఏర్పాటు చేశారు. కాగా సదరు రియాల్టర్ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు రెండు రోజుల్లో తొలగించారు. విషయమై తహసీల్దార్ రాజును సంప్రదించగా ప్రభుత్వ అనుమతి లేదని తెలిపారు. దీంతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న రియాల్టర్ పై చర్యలు తీసుకుంటామన్నారు.

పండుగలు మతసామరస్యానికి ప్రతీకలు



జిల్లాకేంద్రంలో ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



కందూర్‌లో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

జడ్చర్ల: స్థానికంగా గురువారం నిర్వహించిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్చర్ల, మిడ్జిల్ మండలాల పార్టీ అధ్యక్షులు వెంకటయ్య, అల్వాల్‌రెడ్డి, నాయకులు మినాజ్, రవిశంకర్, నిఖిల్‌రెడ్డి,బాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: అందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని హెచ్‌బీ ఫంక్షన్‌హాల్, ఆర్‌బీ ఫంక్షన్‌హాల్, మదీనా మసీద్‌లలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ఎన్పీ.వెంకటేశ్, హాదీ, సిరాజ్‌ఖాద్రీ, మక్సూద్, ఖాజాపాషా, ముస్తాక్ రషీద్, అవేజ్, లక్ష్మణ్‌యాదవ్, సుల్తాన్, సాదతుల్లా పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పట్టణంలోని మదీనా మసీద్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో పార్లమెంటు సభ్యుడు మన్నె శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ ఇంతియాజ్ ఇసాక్‌లు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని సద్దల్‌గుండ్‌లో అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. మజీద్ బా అబ్దుల్లా ఇమామ్ మౌలానా మహ్మద్ ముబారక్ ప్రత్యేక దువా చేశారు. సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా, కార్యదర్శి మహ్మద్ యాఖూబ్ పాల్గొన్నారు.

అడ్డాకుల: పండుగలు మతసామరస్యానికి ప్రతీకలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల మండలం కందూర్ మసీదులో కాంగ్రెస్ నాయకుడు కారెడ్డి దేవేందర్‌రెడ్డి, మూసాపేట మసీదులో పార్టీ మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే పాల్గొన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు తోట శ్రీహరి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కారెడ్డి నాగిరెడ్డి, బుచ్చన్నగౌడ్, రాములు, ఎస్‌టీగౌడ్, నారాయణ, గడ్డం మహేందర్, ఖలీల్, తాజ్, సలాం తదితరులు ఉన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు

నవాబుపేట: సైబర్ క్రైం విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలని.. ఫోన్ల వాడకంపై చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలో యువతకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దని సూచించారు. అలాగే ఎన్నికల సందర్భంగా అసత్యపు సమాచారాన్ని ఫార్వర్డ్ చేయడం వంటి వాటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని.. అనవసరంగా చిక్కుల్లో పడొద్దని సూచించారు.

వాటర్ ఫిల్టర్ అందజేత



అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలకు గురువారం శిక్షణ ఫౌండేషన్ దేవరకద్ర బ్లాక్ కోఆర్డినేటర్ జగ్గప్ప వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగ్గప్ప మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధిని పెంచేందుకు ఈఎస్.రామ్మూర్తి ఆధ్వర్యంలో శిక్షణ ఫౌండేషన్ నిరంతరం పని చేస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థి మొదటి స్థాయిలో మూడు, రెండో స్థాయిలో మూడు అభ్యసన సాధన పుస్తకాలు పూర్తి చేయడంలో మెరుగైన ఫలితాలు సాధించినందునే పొన్నకల్ పాఠశాలకు వాటర్ ఫిల్టర్‌ను బహుకరించినట్లు చెప్పారు. హెచ్‌ఎం సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు అంజనేయులు, శ్యామ్, వాణి ఉన్నారు.

పెద్దవాగు నుంచి ఇసుక అక్రమ రవాణా

అడ్డాకుల: మూసాపేట మండలంలోని పెద్దవాగులో నుంచి ఇసుక అక్రమ రవాణా మళ్లీ కొనసాగుతోంది. కొమిరెడ్డిపల్లి, తాళ్లగడ్డ సమీపంలోని వాగు నుంచి అక్రమార్కులు ఇసుక దందాను కొనసాగిస్తున్నారు. కొమిరెడ్డిపల్లి నుంచి చిన్న డీసీఎంలలో బుధవారం రాత్రి విచ్చలవిడిగా ఇసుక రవాణా కొనసాగింది. అర్ధరాత్రి మొదలైన రవాణా గురువారం తెల్లవారుజాము వరకు సాగింది. అసలే పెద్దవాగు ఎండిపోవడంతో బోరుబావుల్లో నీటిమట్టం తగ్గి పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. తాజాగా మళ్లీ ఇసుక రవాణా మొదలవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా తాళ్లగడ్డ నుంచి ట్రాక్టర్ల ద్వారా రాత్రివేళ ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. జానంపేట, తాళ్లగడ్డకు చెందిన ట్రాక్టర్లలో సగం ట్రాక్టర్లు ఒక రోజు రాత్రి, మరో సగం ట్రాక్టర్లు మరుసటి రోజు రాత్రి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నాయి. స్థానికులు పోలీసులకు సమాచారం చేరవేసినా ప్రయోజనం ఉండటం లేదనే ఆరోపణలు వెలువడుతున్నాయి. మూసాపేట ఎస్‌ఐ కె.సుజాతను సంప్రదించగా సమాచారం ఇస్తే వాహనాలను పట్టుకుంటామని తెలిపారు.

ఎన్‌ఆర్ గ్రాండ్ రెస్టారెంట్ ప్రారంభం



పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్‌పల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్‌ఆర్ గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను గురువారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్‌లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్ యాజమాని నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ నూతన హంగులతో అన్ని రకాల వంటకాలతో రెస్టారెంట్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చిన్నచింతకుంట: అప్పంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం ఆధ్వర్యంలో తిరుమలాపురం, కురుమూర్తి గ్రామాల్లో గురువారం వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి రాజేష్‌ఖన్న హాజరై కేంద్రాలను ప్రారంభించారు. సీఈఓ బషీర్, సిబ్బంది గోవిందరాజు, శివకుమార్, జుబేర్, వినోద్ పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు లింగంనాయక్ అన్నారు. మహబూబ్‌నగర్ మండల ఎస్టీసెల్ అధ్యక్షుడు తులసిరాంనాయక్ ఆధ్వర్యంలో వెంకటాపూర్ గుట్టతండా, రేగడిగడ్డతండా, మాచన్‌పల్లి తండాల్లో గురువారం బంజారా కాంగ్రెస్ దీవెన యాత్ర చేపట్టారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లింగంనాయక్ మాట్లాడుతూ యాత్రకు విశేష స్పందన లభిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి గెలుపులో కీలకపాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు తులసిరాం నాయక్, నాయకులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బోర్లు వేయరాదు

సాక్షి ఎఫెక్ట్..

గండేడ్: ‘ప్రమాద ఘంటికలు’ శీర్షికతో అనుమతి లేకుండా బోర్లు వేస్తూ వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారని సాక్షిలో కథనం ప్రచురితమైన నేపథ్యంలో తహసీల్దార్ నాగలక్ష్మి గురువారం తీవ్రంగా స్పందించారు. రెవెన్యూ సిబ్బంది ఆర్‌ఐలు, సీనియర్ అసిస్టెంటు, వీఆర్‌ఏలకు ఆమె స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఎక్కడ కూడా అనుమతి లేకుండా బోర్లు వేయరాదని.. అలా వేస్తే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బోరు వేయాలనుకున్న వారు ముందుగా అనుమతి కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని.. దీంతో దానికి సంబంధించి చలాను కూడా కట్టాలన్నారు. జియాలజిస్టు రిపోర్టు అనుకూలంగా ఉంటేనే బోరు వేయాలని లేదంటే వేయడానికి వీలు లేదన్నారు. ఈ విషయాలు సిబ్బంది దృష్టిలో ఉంచుకోవాలన్నారు. అందరూ అలర్టుగా ఉండాలని ఆమె వారికి సూచించారు. కొత్తగా బోర్లు వేసే వారిపై దృష్టి పెట్టాలని ఆమె సిబ్బందిని కోరారు. భూగర్భ జలాలు తగ్గుతున్న కారణంగా ఎక్కడపడితే అక్కడ బోరు వేయడానికి వీలు లేదన్నారు. ఎవరైనా వాల్టా చట్టం నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ప్రమాదఘంటికలు..!

సాక్షిలో ప్రచురితమైన కథనం

యూనిఫాంలు డ్వాక్రా సంఘాల వారే కుట్టాలి



మాట్లాడుతున్న అధికారులు

గండేడ్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసే యూనిఫాంలను డ్వాక్రా సంఘాలకు చెందిన మహిళలే కుట్టాలని ఏపీఎం బాలకృష్ణ తెలిపారు. గురువారం ఆయన ఆయా గ్రామాల మహిళా సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా సంఘాల్లో ఉన్న వారు దుస్తువులు కుట్టడానికి వచ్చే వారిని ఎంపిక చేసి.. వారికే అప్పగించాలని తెలిపిందన్నారు. అందుకు అనుగుణంగా ఎంపిక నిర్వహించారు.

కాంగ్రెస్‌లోకి జెడ్పీటీసీ మాజీ సభ్యులు



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న శివకుమార్, భీమయ్యగౌడ్

జడ్చర్ల: నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు జెడ్పీటీసీ మాజీ సభ్యులు గురువారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. వీరిలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్, జడ్చర్ల జెడ్పీటీసీ మాజీ సభ్యులు బాద్మి శివకుమార్, మిడ్జిల్ జెడ్పీటీసీ మాజీ సభ్యులు బీమయ్యగౌడ్‌లతో పాటు పలువురు ఉన్నారు. అదేవిధంగా జడ్చర్ల కౌన్సిలర్లు చైతన్య చౌహాన్, శ్రావణి, మాజీ ఎంపీటీసీ రవిశంకర్, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ మాలిక్, షాకీర్, పెంటయ్య, వినోద్, బ్రహ్మలింగం, కాశీ, కార్తీక్‌రెడ్డి, రాజు తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: కారుకొండకి చెందిన మాజీ ఎంపీటీసీ, బీఆర్‌ఎస్ నాయకుడు విక్రమ్ సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అదేవిధంగా పోమాల్‌కి చెందిన ముదిరాజ్ సంఘం నాయకుడు లింగం సైతం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తాం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్రంలో ఎస్సీలకు ఎంపీ స్థానాల్లో మూడు రిజర్వు అయినప్పటికీ మాదిగలకు ఒక్కటైనా కాంగ్రెస్ కేటాయించకపోవడం తగదని ఎంఎస్‌ఎఫ్ పీయూ అధ్యక్షుడు మీసాల గణేష్ అన్నారు. ఆ పార్టీ వైఖరికి నిరసనగా గురువారం సంఘం ఆధ్వర్యంలో పాలమూరు యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద బైఠాయించి కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తామన్నారు. మాలలకు భయపడి సీఎం పదవిని కాపాడుకోవడానికి రేవంత్‌రెడ్డి తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ పీయూ అధికార ప్రతినిధి మహానంది మాదిగ, ఉపాధ్యక్షుడు శ్రీను, కార్యదర్శులు బాలకృష్ణ, కృష్ణమోహన్, నాయకురాళ్లు శ్రావణి, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

టికెట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం



జడ్చర్ల టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలను విస్మరించిన పార్టీలకు తగిన గుణపాఠం చెబుదామని బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని బీసీసేన కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు రాష్ట్రంలో బీసీ పాటపాడిన ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్లమెంట్ అభ్యర్థుల కేటాయింపులో బీసీలకు తీరని అన్యాయం చేశారన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి వస్తే అన్ని పార్టీలు బీసీ వ్యతిరేకతను చాటుకున్నాయని ఆరోపించారు. అందుకే పై పార్టీల అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీసేన నాయకులు శేఖర్, విజయ్‌కుమార్, గోపాల్, రామస్వామి, గోపాల్, వెంకటేశ్, శివ, శంకర్, మల్లేష్‌లు పాల్గొన్నారు.